పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 104. అల్ హుమజహ్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. 9 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

సూరతుల్ అస్ర్‌లో, సాఫల్యం పొందేవారు ఒకరికొకరు సహాయం చేసుకుంటారు, ఒకరికొకరు శ్రేయస్సు కోరతారు, ఒకరికొకరు మేలు కోరతారు అని తెలుపబడింది. ఇక సూరయె హుమజహ్‌లో ఒకరినొకరు ద్వేషించుకునేవారు, ఒకరినొకరు కీడు కోరేవారు నరకానికి పోతారు అని తెలియజేయబడుతోంది. ఒక మనిషి మరో మనిషికి మేలు చేయడాన్ని చూస్తే వెంటనే అతడికి వ్యతిరేకంగా తయారవుతారు. మేలు చేయడాన్నుండి వారిస్తారు.

## 104. అల్ హుమజహ్

**ఆయత్‌లు : 9** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) లోపాలు వెదికేవాడు, చాడీలు చెప్పేవాడు అయిన ప్రతివాడికీ మూడుతుంది. (2) సంపద కూడబెట్టి లెక్కమీద లెక్క వేసి ఉంచుకొనేవాడు. (3) అతని సొమ్ము అతని వద్ద శాశ్వతంగా ఉంటుందని అతను భావిస్తున్నాడు. (4) ఎంతమాత్రం కాదు. ఆ మనిషి తుత్తునియలు చేసివేసే అగ్నిలో విసరివేయబడతాడు. (5) తుత్తునియలు చేసివేసే అగ్ని ఏమిటో తెలుసా నీకు? (6) అది అల్లాహ్ చేత ప్రజ్వరిల్ల చేయబడిన అగ్ని (7) అది గుండెలలోనికి చొచ్చుకుపోతుంది. (8) వారు అందులో బంధింపబడతారు. (9) అంటే పెద్ద పెద్ద దూలాలలో.

رُكُوعُهَا 1 | 104 سُورَةُ الْهُمَزَةِ مَكِّيَّةٌ | آيَاتُهَا 9

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

وَيْلٌ لِّكُلِّ هُمَزَةٍ لُّمَزَةٍ ﴿1﴾ الَّذِي جَمَعَ مَالًا
وَعَدَّدَهُ ﴿2﴾ يَحْسَبُ أَنَّ مَالَهُ أَخْلَدَهُ ﴿3﴾ كَلَّا
لَيُنبَذَنَّ فِي الْحُطَمَةِ ﴿4﴾ وَمَا أَدْرَاكَ مَا
الْحُطَمَةُ ﴿5﴾ نَارُ اللَّهِ الْمُوقَدَةُ ﴿6﴾ الَّتِي تَطَّلِعُ
عَلَى الْأَفْئِدَةِ ﴿7﴾ إِنَّهَا عَلَيْهِم مُّؤْصَدَةٌ ﴿8﴾ فِي
عَمَدٍ مُّمَدَّدَةٍ ﴿9﴾ ع 1 9 29

1 – 9 వాక్యాలు

ఈ సూరాలో అజ్ఞాన కాలపు సమాజంలో కనబడే దుర్గుణాల ప్రస్తావన ఉంది. వాటిని అరబ్బులు కూడా దుర్గుణాలుగానే భావించేవారు. ఇతరుల తప్పుల్ని వెదకటం, చాడీలు చెప్పడం, తన సొమ్ములో నుండి పేదలకు సహాయపడే వారిని ఎత్తిపొడవడం, ఏదో విధంగా వారిని ఆపడానికి ప్రయత్నించడం.

ఈ సూరాలో అల్లాహ్, వారికి లభించే శిక్షను పేర్కొంటున్నాడు. వీరు చితక్కొట్టే, తోలువలచే, శరీరాన్ని తుత్తునియలు చేసే అగ్నిలో వేయబడతారు. అంటే ఇది ఎంతో కఠిన శిక్ష అవుతుంది. ఈ శిక్షను తప్పించుకోవాలంటే ఇటువంటి చేష్టలను మానుకోండి. ఈనాడు మన సమాజంలో ఇలాగే ఉంది. మనం ఇతరులపై చాడీలు చెప్పటం, పరస్పరం కీడు తలపెట్టడం. ఈ అలవాట్లతో పాటు ఇహంలోనూ పరంలోనూ ఎంతమాత్రం విజయం సాధించలేం. అభివృద్ధి సాఫల్యాల కోసం పరస్పర శ్రేయోభిలాష, సానుభూతి అవసరం.